1St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 2 సంచిక : 271 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 14 సెప్టెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 271 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 14 September 2025 PAGES : 8 PRICE : 3/-


## సమస్యలు, సవాళ్లు దాటి.. సంక్షేమం, అభివృద్ధి ఇస్తున్నాం




(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 13)

జిల్లా ఎస్పీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 7 జిల్లాలకు ఎస్పీలుగా కొత్త అధికారులని, మరో 7 జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి ప్రభుత్వం బదిలీలు చేసింది. 12 జిల్లాల్లో ప్రస్తుతం ఉన్నవారినే ఎస్పీలుగా కొనసాగించింది. 26 జిల్లాల ఎస్పీలు చంద్రబాబుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వ విధానాలు, ఆలోచనలు, లా అండ్ ఆర్డర్ సహా పలు అంశాలపై ఎస్పీలకు సీఎం దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రులు, సెక్రటరీలతో సీఎం సమావేశం అయ్యారు. 15, 16 తేదీల్లో జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్ అజెండా, నిర్వహణపై ముఖ్యమంత్రి చర్చించారు. అధికారుల బదిలీలతో పాలనలో వేగం పెంచే ప్రయత్నాల్లో ముఖ్యమంత్రి ఉన్నారు. మంత్రులు మరింత సమర్థంగా, ప్రభావవంతంగా పనిచేయాలని సీఎం సూచించారు. సమస్యలు, సవాళ్లు దాటి సంక్షేమం, అభివృద్ధి ఇస్తున్నాం.. ఇప్పుడు పాలనలో వేగం పెరగాలంటూ మంత్రులకు, ఉన్నతాధికారులకు సీఎం స్పష్టం చేశారు.

## విశాఖ మధురవాడకు మహర్దశ

### ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 13)

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ మధురవాడలో రూ.వెయ్యి కోట్లతో రెండు కీలకమైన ప్రాజెక్టులు మొదలు కాబోతున్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 6వ వార్డులో రూ. 1.72 కోట్లతో ప్రతిపాదించిన రోడ్లు, డ్రెయిన్లకు వైభవ్ నగర్ లో శనివారం



శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐ.ఎఫ్.సి.) నిధులు రూ. 535 కోట్లతో 38 ఎం.ఎల్.డి. సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు, 400 కిలో మీటర్ల పొడవున సీవేజ్ లైన్ నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. -మిగతా 2లో

## అమరావతిపై మళ్లీ వైకాపా నేతల దొంగ నాటకాలు: మంత్రి అనగాని

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 13)

ప్రజా రాజధాని అమరావతిపై మళ్లీ వైకాపా నేతలు దొంగ నాటకాలు ఆడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఈ విషయంలో మూడు ముక్కలాట ఆడిన జగన్‌ను ప్రజలు చీదరించుకున్నారని మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణం అక్కర్లేదంటూనే గుంటూరు, విజయవాడ మధ్య నిర్మిస్తామని కబుర్లు చెబుతున్నారని దుయ్యబట్టారు. ఇక్కడి రైతులు, మహిళలపై జగన్ వేధింపులు, పెట్టిన కేసులు ఇంకా మర్చిపోలేదన్నారు. ఆయన గోడ మీద పిల్లి వైఖరిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని చెప్పారు. ఐదేళ్లపాటు అమరావతిని నిర్లక్ష్యం చేసిన జగన్‌ను వచ్చే ఎన్నికల్లోనూ రాష్ట్ర ప్రజలు ఓడిస్తారని పేర్కొన్నారు.



## జనసైనికులు ఆవేశాలకు లోనై ఘర్షణకు తావీయవద్దు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 13)

రాష్ట్రంలో అభివృద్ధి దిశగా.. సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్న ఈ తరుణంలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే విధంగా కుట్రలు మొదలయ్యాయని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు జనసైనికులకు పలు సూచనలు చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు."ఇలాంటి కుట్రలకు పాల్పడే వారి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. సామాజిక మాధ్యమాల ముసుగులో, యూట్యూబ్ ఛానెళ్ల పేరుతోనో, మరో మార్గంలోనో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. కుయుక్తులతో సమాజంలో అశాంతి, అభద్రత కలిగించే -మిగతా 2లో

## అధికారం కోసమే రాజధానిపై జగన్ మాట మారుస్తున్నారు మంత్రి నారాయణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 13)




వైకాపా అధ్యక్షుడు జగన్‌కు రాజధానిపై స్పష్టత లేదని మంత్రి నారాయణ విమర్శించారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజధానిపై వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. "రాజధానికి 30వేల ఎకరాలు కావాలని అసెంబ్లీలో జగనే చెప్పారు. ఆ తర్వాత పొలిటికల్ గేమ్‌తో మూడు ముక్కలాట ఆడారు. ఏ పార్టీ అయినా.. ప్రజల అభిప్రాయం ప్రకారం రాజకీయం చేయాలి. అనంతపురం, శ్రీకాకుళానికి అమరావతి సెంటర్ పాయింట్‌లో ఉంది. అమరావతికి రైల్వే కనెక్టవిటీ, పోర్టు, ఎయిర్ పోర్టు దగ్గరలోనే ఉన్నాయి. రాజధానిగా అమరావతిని అంగీకరించి అసెంబ్లీలో జగన్ కూడా చేతులెత్తారు. మళ్లీ ప్రభుత్వం రాగానే మాట మార్చారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అని.. మళ్లీ అధికారం కోసం అమరావతి అని మాట మార్చడం కరెక్ట్ కాదు.

ఇలా చేస్తే భవిష్యత్‌లో ప్రజలు ఆ 11 సీట్లు కూడా ఇవ్వరు. గదిలో కూర్చొని నలుగురైదుగురు ఇచ్చే సలహాలు పాటించకూడదు. సజ్జల ఆ పార్టీలో సీనియర్‌నేత.. ఆయన చెబితే వైకాపా చెప్పినట్టే కదా. వారి పార్టీ అభిప్రాయమే ఆయన చెప్పారు. నేను మంత్రిగా మాట్లాడితే సీఎం చంద్రబాబు చెప్పినట్టే కదా. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. అమరావతి, విజయవాడ, మంగళగిరి, తెనాలి, గుంటూరు కలిపి భవిష్యత్తులో మహా నగరంగా చేయాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన" అని మంత్రి నారాయణ వివరించారు.

**విజయవాడలో డయేరియా మూలాలు కనుక్కునేందుకు దృష్టి పెట్టాం**

విజయవాడలోని న్యూరాజరాజేశ్వరిపేటలో డయేరియా మూలాలు ఎక్కడున్నాయో కనుక్కొనేందుకు దృష్టి పెట్టామని మంత్రి నారాయణ తెలిపారు. ఆర్ఆర్ పేటలో శనివారం ఆయన పర్యటించారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డయేరియా మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. నూతన ప్రభుత్వాసుపత్రిలో బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఈ సాయంత్రం లేదా రేపు ఉదయానికి నీటి పరీక్షల నివేదికలు వస్తాయన్నారు. -మిగతా 2లో

## జీఎస్టీ సవరణలతో దేశ ప్రజలపై తగ్గనున్న భారం: మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 13)

2025-26 మొదటి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశం చేసే ఎగుమతుల్లో వృద్ధిని సాధించగలిగామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించారని ప్రధాని మండిపడ్డారు. "2014కి ముందు టూత్‌పేస్ట్, సబ్బు, నూనె వంటి రోజువారీ నిత్యావసర వస్తువులకు కూడా 27 శాతం పన్ను విధించేవారు. నేడు వీటిపై కేవలం 5శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తుంది. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించడం వల్ల సాధారణ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ చాలా ఖరీదైనదిగా మారింది" అని అన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలను తగ్గించాయని.. సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్ నిర్మాణ సామగ్రి కూడా చౌకగా మారతాయని ప్రధాని తెలిపారు. వివిధ హోటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈవిధంగా దేశంలోని అనేక కుటుంబాలపై భారం -మిగతా 2లో

## నేపాల్ సంక్షోభంపై ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు

**నేపాల్ సంక్షోభంపై తొలిసారి స్పందించిన యోగి ఆదిత్యనాథ్**

**చిన్న సమస్యలను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక**

**ప్రజా ప్రతినిధులు, అధికారులు సున్నితంగా వ్యవహరించాలని సూచన**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 13)



సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై ప్రభుత్వం కూలేదాకా వెళ్లిన ఆందోళనలు నేపాల్‌లో ఇటీవల చోటుచేసుకున్న తీవ్ర హింసాత్మక ఆందోళనలపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ -మిగతా 2లో

## విశాఖలో జరగనున్న సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

**విశాఖ ఉక్కు పరిశ్రమపై అపోహలు సృష్టిస్తున్నారని మాధవ్ మండిపాటు**

**ప్రైవేటీకరణను భూతంలా చూపించే ప్రయత్నం చేస్తున్నారన్న మాధవ్**

**మూడు రాజధానుల పేరుతో జగన్ డ్రామాలాడారని విమర్శ**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 13)

విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో కొందరు పనిగట్టుకొని అపోహలు సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మండిపడ్డారు. కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్ పురోభివృద్ధి సాధిస్తోందని, ఈ మంచి విషయాన్ని ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని ఆయన ప్రశ్నించారు. విశాఖలో శనివారం -మిగతా 2లో



## జనసైనికులు ఆవేశాలకు లోనై

# ఘర్షణకు తావీయవద్దు

వ్యక్తుల నైజాన్ని పదేళ్లుగా చూస్తున్నాం. వారి ఉచ్చులో పడి, ఆవేశాలకు లోనై, ఘర్షణ వాతావారణానికి తావీయవద్దు. అలా ఆవేశాలు ప్రదర్శిస్తే కుట్రదారులు ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయి.

**సమస్య జటిలం చేయొద్దు..** ఇటీవల మచిలీపట్నంలో చోటు చేసుకున్న ఘటనలు ఇందుకు ఉదాహరణ. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో ఒక వ్యక్తి అభ్యంతరకర భాష ఉపయోగించి మాట్లాడాడు. అతను ఆ విధంగా మాట్లాడేలా సిద్ధం చేసి, ప్రచారం చేయడం వెనక ఉన్న కుత్సిత ఆలోచనను పసిగట్టాలి. దానిపై చట్ట ప్రకారం కేసులుపెట్టి ముందుకు వెళ్లాలి. తొందరపడి మరో మార్గంలో వెళ్లి ఘర్షణపడటం ద్వారా సమస్య జటిలం అవుతుంది. ప్రజల మధ్య సామరస్య వాతావరణం చెడగొట్టి రెచ్చగొట్టే నాయకులు బయటకు వస్తారు.

**మచిలీపట్నం వివాదంపై పార్టీలో అంతర్గత విచారణకు ఆదేశం**

కులాలు, మతాల మధ్య విభేదాలు తీసుకువచ్చే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాలి. ఈ దిశగా ముందుకు వెళ్లాలని జనసేన నాయకులు, శ్రేణులతోపాటు కూటమి నాయకులకు సూచిస్తున్నాను. సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెల్స్ రూపంలోనో, విశ్లేషకుల ముసుగులోనో రెచ్చగొట్టే వారిని, అభ్యంతరకర రీతిలో మాట్లాడేవారిని చట్టం ముందు నిలపాలి. వీరి వెనక ఉండి వ్యవస్థీకృతంగా రెచ్చగొట్టి కుట్రలు చేసేవారిపైనా ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించాలి. మచిలీపట్నం వివాదంపై పార్టీలో అంతర్గత విచారణ చేయాలని నాయకులకి ఆదేశాలు ఇచ్చాను. ఈ ఘటనలో పాలుపంచుకున్న వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని సూచించా. కుట్రలు చేసేవారి కుత్సిత నైజం కలిగిన పార్టీ, ఆ పార్టీ నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వారు చేసే దుష్ప్రచారాన్ని ప్రజాస్వామ్యయుతంగా, చట్ట ప్రకారమే తిప్పికొడదాం" అని పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ సూచించారు.

# విశాఖ మధురవాడకు మహర్దశ

ఇందులో రూ.498 కోట్లు ఐ.ఎఫ్.సి. ఇస్తుండగా, మిగిలిన మొత్తాన్ని జీవీఎంసీ భరిస్తుందని వివరించారు. భవిష్యత్ లో మధురవాడకు తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా రూ.500 కోట్లతో భారీ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇవి కాకుండా మధురవాడ జోన్‌లో రూ.120 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు తదితర మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ప్రారంభమైన తర్వాత మధురవాడ అభివృద్ధి పుంజుకుంటుందన్నారు.

జగన్ మతి భ్రమించి మాట్లాడుతున్నారు..

అనంతపురంలో కూటమి సభ విజయవంతం కావడంతో జగన్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని శ్రీనివాసరావు విమర్శించారు. జగన్ ప్రారంభించిన 17 మెడికల్ కాలేజీల్లో ఐదు మాత్రమే పూర్తయ్యాయన్నారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి ఖర్చు చేసిన రూ.500 కోట్లతో నర్సీపట్నం మెడికల్ కాలేజీని పూర్తి చేసి ఉండవచ్చన్నారు. ఇప్పటికైనా అతని వైఖరి మార్చుకోకపోతే రాబోయే ఎన్నికల్లో వైకాపా సింగిల్ డిజిట్‌కు పరిమితమవుతుందని విమర్శించారు.

మొదటిపేజీ తరువాయి

**రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభించిన గంటా**

మధురవాడ శిల్పారామంలో 9వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్, వైజాగ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బౌట్ ను ప్రారంభించి పోటీలను తిలకించారు.

# అధికారం కోసమే రాజధానిపై జగన్ మాట మారుస్తున్నారు మంత్రి నారాయణ

రిపోర్టులు వచ్చాక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డయేరియాకు కారణం తాగునీరా లేదా ఫుడ్ పాయిజన్ అన్నది స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే 15 వేల వాటర్ క్యాన్ల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 150 మంది చికిత్స తీసుకుని ఇంటికెళ్లారని వివరించారు. డయేరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ప్రజలెవరూ వదంతులు నమ్మవద్దని సూచించారు.

# జీఎస్టీ సవరణలతో దేశ ప్రజలపై తగ్గనున్న భారం: మోదీ

తగ్గించామంటూ వ్యాఖ్యానించారు. మన ఆర్థికవ్యవస్థ తయారీ రంగం వృద్ధి మన జాతీయ భద్రతకు చాలా ముఖ్యమైనదన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో.. ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తున్న వారికి భారత సైన్యం ఎలా బుద్ధి చెప్పిందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాని మోదీ అన్నారు. మన సాయుధ దళాలు చూపిన తెగువకు దేశం మొత్తం గర్వపడిందన్నారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ ఆయుధాలే మన దేశాన్ని రక్షించడంలో ముఖ్య పాత్ర పోషించాయన్నారు. మణిపుర్‌లో జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ఆ రాష్ట్రంలో నేడు పర్యటించనున్నారు. దీనికి ముందు మిజోరంలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బైరాబి-సైరాంగ్ రైల్వేలైన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మిజోరం నుంచి చురాచంద్‌పుర్ చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు ఘర్షణల్లో నిరాశ్రయులైన వారిని కలుసుకుంటారు. ఆ తర్వాత చురాచాంద్‌పుర్‌లో రూ.7,300 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే ఇంఫాల్‌లో రూ.1,200 కోట్లకు పైగా ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు.

# నేపాల్ సంక్షోభంపై ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు

స్పందించారు. చిన్న సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి పెను ప్రమాదాలకు దారితీస్తాయో చెప్పడానికి నేపాల్ పరిణామాలే ఒక ఉదాహరణ అని ఆయన అన్నారు. ఏ సమస్య అయినా మొగ్గలోనే గుర్తించి, సున్నితత్వంతో పరిష్కరించాలని ఆయన హితవు పలికారు. లక్నోలోని రామ్ మనోహర్ లోహియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో యోగి మాట్లాడుతూ, "ప్రజా ప్రతినిధులుగా మేం కూడా ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొంటాం, వారి సమస్యలను ఓపికగా విని, సరైన పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత మాపై ఉంది" అని అన్నారు. వైద్యులు కూడా రోగులతో, వారి కుటుంబ సభ్యులతో సున్నితంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. నేపాల్ పరిణామాలను ప్రస్తావిస్తూ, "నేపాల్‌లో ఏం జరిగిందో మీరంతా చూసే ఉంటారు. ఒక చిన్న సామాజిక మాధ్యమం అంశాన్ని మొదట అందరూ తేలిగ్గా తీసుకున్నారు. కానీ దాని పర్యవసానం ఎలా ఉంది? ఆ దేశ అభివృద్ధి, పురోగతి ఎలా ఆగిపోయాయో గమనించాలి. ప్రజల జీవితాలతో ఎలా ఆడుకున్నారో చూడాలి. ఇలాంటి సంఘటనలు మరెక్కడా పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ తమ రంగాల్లో అప్రమత్తంగా ఉండాలి" అని యోగి హెచ్చరించారు.

# విశాఖలో జరగనున్న సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖలోని రైల్వే మైదానంలో 'సారథ్యం' భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. కడప నుంచి ప్రారంభమైన సారథ్యం యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంపై పీవీఎన్ మాధవ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మూడు రాజధానుల పేరుతో జగన్మోహన్ రెడ్డి డ్రామాలాడి, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వం మైనార్టీల నిధులను కూడా దారి మళ్లించిందని ఆరోపించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై వామపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు. ప్రైవేటీకరణను ఒక భూతంలా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, కానీ ఇది అన్ని దేశాల్లోనూ జరుగుతున్న ప్రక్రియేనని అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని తొలుత కోరింది బీజేపీయేనని ఆయన గుర్తుచేశారు.

ఎన్డీఏ సారథ్యంలో పోలవరం ప్రాజెక్ట్, అమరావతి రాజధాని నిర్మాణం పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయని మాధవ్ తెలిపారు. అలాగే, ఈ నెల 17వ తేదీన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విశాఖపట్నంలో పర్యటించనున్నారని ఆయన వెల్లడించారు.

# దశదినకర్మలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 13)**

మండలంలోని పలుకూరు పంచాయతీ పరిధిలోని పంటవారిపాలెం గ్రామానికి చెందిన నలదల నరసింహారావు కుమార్తె రాధ ఇటీవల మరణించారు. శనివారం వారి స్వగృహంలో జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై రాధ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నార్నే రోశయ్య, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దామచర్లను కలిసిన కమ్మకార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 13)**

ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి శనివారం ఒంగోలులోని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు స్వగృహానికి చేరుకుని ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో కార్పొరేషన్ ద్వారా చేయబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాటూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నా టైం వేస్ట్ చేస్తున్నట్లే .. నాటోపై ట్రంప్ వ్యాఖ్యలు

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 13)**



రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై భారీ సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా నాటోను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయడంతోపాటు, చైనాపై సుంకాలు విధించినప్పుడే ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగుస్తుందన్నారు. లేదంటే తన సమయంతోపాటు అమెరికా డబ్బునూ వృథా చేస్తున్నట్లేనని అన్నారు. మరోవైపు మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు చైనాపై 50 నుంచి 100శాతం సుంకాలు విధించాలన్నారు. నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం షాక్‌కు గురిచేస్తోందని సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పేర్కొన్నారు. ఈ చర్యలే రష్యాతో చర్చలు, బేరసారాల శక్తిని చాలా బలహీన పరుస్తున్నాయని చెప్పారు. ఇందుకు నాటో దేశాలపై విమర్శలు చేసిన ట్రంప్.. యుద్ధంలో విజయం సాధించాలనే పూర్తి నిబద్ధత వారిలో కనిపించడం లేదన్నారు. చమురుపై నాటో నిషేధంతోపాటు చైనాపై 50 నుంచి 100శాతం సుంకాలు విధించడం వంటి చర్యలు ఈ యుద్ధం ముగింపునకు దోహదపడతాయన్నారు. రష్యాపై బీజింగ్ పట్టు సాధించిందని.. సంకాలు విధించడం ద్వారా దీన్ని బలహీనపరచవచ్చని అన్నారు. ఈ యుద్ధానికి మునుపటి అధ్యక్షుడు బైడెన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలే కారణమని మరోసారి ఆరోపించారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై టారిఫ్‌లు విధించాలని ఈయూ, జీ7 దేశాలకు విజ్ఞప్తి చేసిన మరుసటి రోజే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి అత్యధిక స్థాయిలో చమురు కొనుగోలు చేస్తున్న దేశం చైనా. ఆ తర్వాతి స్థానంలో భారత్ ఉంది. మూడో స్థానంలో తుర్కియే ఉండగా.. అది నాటో కూటమిలో భాగం. ఇందులో సభ్యదేశాలుగా ఉన్న హంగేరి, స్లొవాకియా కూడా మాస్కో నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నాయి.

# సొంతింటి కలను కాపాడేందుకు 'ఫండ్'.. కేంద్రానికి సుప్రీం సూచన

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,సెప్టెంబర్ 13)**

పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది సొంతింటి కలలు సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అటువంటి వాటిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి' ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది.



నివాస ప్రాజెక్టు విషయంలో ఓ వివాదానికి సంబంధించిన పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. రియల్ డెవలపర్ల చేతిలో గృహ కొనుగోలుదారులు మోసపోకుండా లేదా దోపిడీకి గురికాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేందుకు ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, దాన్ని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొంది. దేశ పట్టణీకరణ విధానాలకు అనుగుణంగా ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేలా చూడాలని స్పష్టం చేసింది.

**మౌన ప్రేక్షకుడిగా ఉండొద్దు..** రెరా ను 'కోరలు తీసిన పులి'గా మార్చొద్దని, అవసరమైన మౌలిక సదుపాయాలు, ట్రైబ్యునళ్లు, సమర్థమంతమైన యంత్రాంగం ఉండాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అప్పుడే వారి ఆదేశాలు వేగంగా, కచ్చితంగా అమలు అవుతాయని అభిప్రాయపడింది. ఈ విషయంలో ప్రభుత్వం మౌనప్రేక్షకుడిగా ఉండకూడదని హితవు పలికింది. గృహ కొనుగోలుదారులు, ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేసింది. నిలిచిపోయిన ప్రాజెక్టులను గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ లేదా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో ఓ సంస్థను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని సూచించింది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం




## జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 13)**

రాష్ట్ర వ్యాప్తంగా శనివారం 14 జిల్లాల ఎస్పీలకు స్థాన చలనం సంభవించింది. ఈ నేపథ్యంలో ప్రకాశం జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా తిరుపతి అర్బన్ ఎస్పీగా పని చేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా ప్రకాశం ఎస్పీగా నియమితులయ్యారు. త్వరలోనే ఆయన జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించిన ఏ ఆర్ దామోదర్‌ను విజయనగరం జిల్లా ఎస్పీగా నియమించారు.

# జిల్లాలో యూరియా పంపిణీ పకడ్బందీగా అందించాలి



**వ్యవసాయ అధికారులు, తహశీల్దార్లు**
**యూరియా పంపిణీ కేంద్రాలను పరిశీలించాలి**
**ఏ మండలంలో రైతులు పంటలు వేసి ఉంటే**
**ఆ మండలంలోనే యూరియా ఇవ్వాలి**
**ఎరువుల కొరత, అధిక ధరలు ఉంటే కంట్రోల్ రూమ్**
**8247040131కు ఫిర్యాదు చేయాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, సెప్టెంబర్ 13)**

జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీగా యూరియా ను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్‌డిఓలు, మండల తహశీల్దార్లు, యంపిడిఓలు, మండల వ్యవసాయ అధికారులతో జిల్లాలో రైతులకు యూరియా పంపిణీ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పకడ్బందీగా పంపిణీ జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారులు చెప్పిన విదంగా మండల వ్యవసాయ అధికారులు సోమవారం నుండి ఆదివారం వరకు ఎంత యూరియా అవసరముందో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు గత సంవత్సరంలో జిల్లాలో ఈ రోజు నాటికి ఎన్ని ఎకరాలలో పంటలు వేశారు. ఇప్పుడు ఎన్ని ఎకరాలలో పంటలు వేశారని నిర్ధారణ చేసుకోవాలని ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారులు యూరియా ఎంత వచ్చింది, ఎంత రైతు కేంద్రాలకు పంపించమని ప్రతి రోజు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఏ మండలం రైతులు వ్యవసాయం చేస్తుకుంటున్నరో ఆ మండలంలోనే రైతులకు యూరియా పంపిణీ చేయాల్సిన బాధ్యత మండల వ్యవసాయ అధికారులదేనని చూచించారు. మండలంలో ఎన్ని ఎకరాలు పంటలు పెట్టారో అన్ని ఎకరాలకు మాత్రమే యూరియా పంపిణీ చేయాలని, మండలాలలో ఇప్పటి వరకు ఎంత యూరియా పంపిణి చేశారు. ఇంకా ఎంత అవసరం అవుతుందని అంచనాలు చేసుకోవాలన్నారు. ఏ మండలానికి ఎంత అవసరమవుతుందో అంతే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎరువుల కొరత, అధిక ధరలు ఉంటే కంట్రోల్ రూమ్ 8247040131 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేసేలా రైతులకు అవగాహన కలిగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి యూరియా పంపిణీ కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ అధికారి వీఆర్వో లేదా వీఆర్ఏ, ఒక పోలీస్ అధికారి ఉండి రైతులకు ఎలా పంపిణీ జరుగుతుందని పరిశీలించాలన్నారు. రైతు కేంద్రం వద్ద ఉన్న విఆర్ఓ, విఆర్ ఏ, గ్రామ వ్యవసాయ అధికారి యూరియాకు వచ్చే రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలు పెట్టారు. వారికి ఎంత అవసరమవుతుందో వంటి వివరాలను తీసుకోవాలన్నారు. ఎవరికైనా ఎక్కువ ఇస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జాయింట్ టాస్క్ ఫోర్స్ కమిటీ ప్రతిరోజు రైతు కేంద్రాలను పరిశీలించాలన్నారు. రైతు కేంద్రాలకు వచ్చే రైతులకు ముందుగానే టోకెన్లు ఇవ్వాలని, ఒక్క వేళా టొకన్లు ఇచ్చిన అందరికి ఉన్న యూరియా సలకపోతే టొకన్లు ఇచ్చిన వారికి ముందుగానే సమాచారం తెలియజేయాలని, అలాంటి వారికి మరుసటి రోజు వచ్చి తీసుకునేలా వారికి తెలియజేయాలన్నారు. ఎంత నిల్వవుందో అంతే ఇవ్వాలని (తరువాయి 4లో...)

## ఘనంగా శిద్దా లక్ష్మీ పద్మావతి జన్మదిన వేడుకలు

### సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 13)**

రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి జన్మదిన వేడుకలు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఘనంగా జరిగాయి. గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ గిరి బాబు, కాట్రగడ్డ రమణయ్య, ఆధ్వర్యంలో లక్ష్మీ పద్మావతి జన్మదిన వేడుకలలో శిద్దా రాఘవరావు అభిమానులు, శ్రేయోభిలాషులు,

4





## ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అములు చేస్తాం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, సెప్టంబర్ 13)**

రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పకడ్బందీగా అములు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం బాపట్ల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ శనివారం బాపట్ల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం జరిగిందని, అంతకు ముందు అనంతపురం జిల్లాలో 18 నెలల పాటు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అములు పరిచే సంక్షేమ పథకాలు పకడ్బందీగా అములు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు కావలసిన ప్రతి సౌకర్యాన్ని చేసే దిశగా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశాల హాల్స్, రెవెన్యూ శాఖ పరిధిలో పలు విభాగాలు, సిపిఓ, ఎన్ఐసి, ల్యాండ్, రికార్డ్స్, ఆర్‌డిఓ కార్యాలయాలు, కలెక్టరేట్ ఆవరణలోని పరిసరాలు పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు చేరుకున్న కలెక్టర్ వినోద్‌కుమార్‌కు జిల్లా రెవెన్యూ అధికారి, ఇంచార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏఓ మల్లిఖార్జునరావు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు, బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, ఎం ఎం కొండయ్యలు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి బొకేలు అందజేశారు.



4

## జిల్లా సమగ్రాభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటా

### నూతన జిల్లా కలెక్టర్ పి రాజా బాబు



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, సెప్టంబర్ 13)**

ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ జిల్లా సమగ్రముగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ పి రాజా బాబు చెప్పారు. ప్రకాశం జిల్లా 39వ కలెక్టర్‌గా శనివారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఎన్ఎస్‌పి గెస్ట్ హౌస్ కు వచ్చిన కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్వో బి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, కనిగిరి ఆర్డిఓ కేశవర్ధన్‌రెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రకాశం భవనంకు తీసుకుని వెళ్ళగా వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దల ఆశీర్వచనాల మధ్య జిల్లా కలెక్టర్‌గా రాజా బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం మేరకు జిల్లాలోని ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పొలిటికల్ గవర్నెన్స్ పై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. పరిష్కారం కాని సమస్య అంటూ ఏదీ ఉండదని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వెలుగొండ ప్రాజెక్టుతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పన పై తాను దృష్టి సారిస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం పలువురు జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. (తరువాయి 4లో...)



# ఘనంగా శిద్దా లక్ష్మీ పద్మావతి జన్మదిన వేడుకలు









జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్య మహిళా విభాగ్, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి సేవాదళ్ నాయకులు, గ్రానైట్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును శిద్దా రాఘవరావు దంపతులు కట్ చేశారు. అనంతరం భారీ గజ మాలతో సత్కరించారు. ఆలయ ఇంచార్జ్ ఎం వెంకటేశ్వర్లు, అర్చకులు శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి దంపతులను గజమాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

**జ్యోతి గ్రానైట్ ఆధ్వర్యంలో లక్ష్మి పద్మావతి పుట్టినరోజు రోజు వేడుకలు :** మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మి పద్మావతి పుట్టినరోజు వేడుకలు శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా నిర్వహించారు. జ్యోతి గ్రానైట్ సిఓఓ ఎమ్ శివ రామ్ ఆధ్వర్యంలో జ్యోతి గ్రానైట్ సిబ్బంది ఏర్పాటు చేసిన భారీ కేకు ను శిద్దా దంపతులు కట్ చేసారు. అనంతరం జ్యోతి గ్రానైట్ భారీ గజమాలతో శిద్దా దంపతులను సత్కరించారు.

**సేవా కార్యక్రమాల నిర్వహించిన అభిమానులు :** శిద్దా లక్ష్మీ పద్మావతి జన్మదినం సందర్భంగా శిద్దా అభిమానులు, గోల్డెన్ గిరి, కాట్రగడ్డ రవణయ్య ఆధ్వర్యంలో చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో భారీగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన పుట్టినరోజు వేడుకలలో బండ్లమూడి ప్రభుత్వ పాఠశాల చెందిన 200 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, చీమకుర్తి మండల పాత్రికేయ మిత్రులకు హాట్ వాటర్ కేటిల్స్, మహిళలకు పసుపు కుంకుమ, సారె ను శిద్దా రాఘవరావు దంపతులు అందచేశారు. లక్ష్మీ పద్మావతి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు పట్ల శిద్దా రాఘవరావు దంపతులు సంతోషం వ్యక్తం చేస్తూ మానవ సేవే మాధవ సేవ అని, సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం తమకు సంతృప్తి కలిగించింది అని శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మి పద్మావతి దంపతులు తెలిపారు. శిద్దా లక్ష్మీ పద్మావతి పుట్టినరోజు పునస్కరించుకుని ఆలయ అర్చకులు, శ్రీశైలం దేవస్థానం వేద పండితులు, శ్రీ హరిహర క్షేత్రం అర్చకులు సుబ్రమణ్యం శర్మ, హరి కుమారా చార్యులు, హరికృష్ణ శర్మ, కృష్ణ శర్మ శిద్దా రాఘవరావు దంపతులకు వేద ఆశీర్వదాలు అందజేశారు. ఈ వేడుకలలో శిద్దా రాఘవరావు కుటుంబ సభ్యులు, రావిపూడి లక్ష్మి నారాయణ దంపతులు, గుమ్మడి సాయి బాబా ఆర్యవైశ్య సంఘం నాయకులు, దర్శి, చీమకుర్తి పట్టణానికి చెందిన ప్రముఖులు, శ్రేయోభిలాషులు ఆర్యవైశ్య జిల్లా నాయకులు, చీమకుర్తి, దర్శి, ఒంగోలుకు చెందిన ఆర్యవైశ్య మహిళా విభాగం, ఆర్యవైశ్య యువజన నాయకులు, వాసవి సేవాదళ్ నాయకులు, చీమకుర్తికి చెందిన మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిద్దా లక్ష్మీ పద్మావతికి శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లాలో యూరియా పంపిణీ పకడ్బందీగా అందించాలి

ఎక్కువ యువరాదన్నారు. మండలాల వారిగా యూరియా సప్లై చేయడం జరుగుతుందని, ప్రతిరోజు మండల వ్యవసాయ అధికారులు తహశీల్దార్లతో యూరియా పంపిణీ పై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతు కేంద్రాలలో సిబ్బంది తక్కువగా ఉంటే తక్కువగా ఉన్న చోటుకు అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. యూరియా పంపిణీలో ఎలాంటి సమస్యలు వస్తాయని ముందుగానే గుర్తించి సమస్యలు వస్తే వాటిని ఎలా పరిష్కరించాలని దాని పై దృష్టి సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు. యూరియా పంపిణీలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుండి ఏడిఏ, వ్యవసాయ అధికారిణి అన్నపూర్ణ జిల్లా మార్క్‌ఫెడ్ డియం కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తాం













# జిల్లా సమగ్రాభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటా






















# ఇండోసోల్ కోసం ఉప్పరపాలెం ఖాళీ చేయం






**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 13)**

ఇండోసోల్ మా గ్రామం ఖాళీ చేయకూడదు అని చేసుకున్న మా గ్రామ తీర్మానమను బ్యానర్ రూపంలో గ్రామ ప్రకటనగా ఈ రోజు మా గ్రామంలో ఉంచాము. అనంతరం ఇండోసోల్ అనే ప్రవేటు కంపెనీ కోసం పచ్చటి పొలాల మద్యలో స్వేచ్ఛగా జీవించే రాజ్యాంగ ప్రసాదించిన మా ప్రాథమిక హక్కును హరించి మమ్మల్ని తరలిండడం అన్యాయం అని గ్రామంలోని అంభేత్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. "కరేడు పంచాయితీలోని ఉప్పరపాలెం గ్రామ ప్రజలమైన మేము జూలై 4, 2025 న మా గ్రామ పంచాయితీ "ఇండోసోల్ కు మా భూములు ఇవ్వము" అని చేసిన గ్రామ తీర్మానం ప్రకారం సెప్టెంబర్ 9 ,2025న ఉప్పరపాలెం గ్రామ సమావేశం నిర్వహించుకొని "ఇండోసోల్ కొరకు మా ఇళ్ళు ఇవ్వకూడదు. మా గ్రామాన్ని ఖాళీ చేయకూడదు" అని గ్రామ తీర్మానం చేసుకున్నాము. మేము అభివృద్ధికి వ్యతిరేఖం కాదు. ఇండోసోల్ కోసం మూడు పంటలు పండే పచ్చని మా కరేడు రైతుల పంట పంటపొలాల మద్యలో ఉన్న మా ఉప్పరపాలెం గ్రామాన్ని విచ్ఛిన్నం చేయడానికి మేము వ్యతిరేఖం. ఇండోసోల్ ను పంటలు పండని బీడు భూములలో నిర్మించండి. మా ఉప్పరపాలెం ను, మా కరేడు రైతుల పంట పొలాలను కాపాడండి. ఈ గాలి, ఈ నీరు, ఈ నేల వదిలి మేము ఎక్కడికీ వెళ్ళమని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలతో పాటు యువత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైసీపీ కందుకూరు ఇన్చార్జి సంస్కారవంతంగా మాట్లాడాలి

**బట్ట కాల్చి నెత్తినేస్తే చూస్తూ ఊరుకోం**

**అర్ధరహిత ఆరోపణలు తగవు**

**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 13)**

వైసిపి కందుకూరు ఇంచార్జ్ బుర్ర మధుసూదన్ యాదవ్ అర్ధరహితంగా, సంస్కారహీనంగా మాట్లాడడం సబబు కాదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఉదయం ఆయన తన కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, అర్ధరహిత ఆరోపణలు చేయడం బుర్రాకు ఏమాత్రం తగద న్నారు. బట్ట కాల్చి నెత్తిన వేసే చర్యలు మానుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి హితవు పలికారు. కనిగిరిలో మీ నిర్వాకం గురించి చెప్పాలంటే,నాకు సంస్కారం అడ్డువస్తుందని ఆయన ముక్తసరిగా మాట్లాడారు. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక విమానాలలో ఆంధ్రప్రదేశ్ కు తరలించిన మంత్రి లోకేష్ చర్యలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాట్మండులో జరుగుతున్న విపరీత పరిణామాలను దృష్టిలో ఉంచుకుని అక్కడి తెలుగువారిని వెనువెంటనే ప్రత్యేక విమానాలలో స్వరాష్ట్రానికి రప్పించిన మంత్రి లోకేష్ అభినందనీయుడన్నారు. ?అనంతపురంలో భారీ బహిరంగ సభ ఉన్నప్పటికీ దాన్ని ప్రక్కన పెట్టి నేపాల్ లో ఆపదలో ఉన్న తెలుగువారిని ఆదుకోవడమే తన ప్రధమ ప్రాధమ్యం గా లోకేష్ క్రియాశీలకంగా పని చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆంధ్రుల కష్టసుఖాల్లో వెన్నంటి ఉండే పార్టీ అని ఎమ్మెల్యే ఇంటూరి తెలియజేశారు. జగన్ ఈ పనిని సైతం ఎగతాళి చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని 1.63 కోట్ల మందికి ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఆరోగ్య భీమా తీసుకురావడం దేశ చరిత్రలోనే అద్వితీయ ఘట్టంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభివర్ణించారు. పేదల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కున్న అభిమానానికి ఇది నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రానికి అన్ని విధాల సహకరిస్తుందని ఆయన కేంద్రానికి ధన్యవాదాలు తెలియజేశారు. కందుకూరు నియోజకవర్గంలో 15 నెలల కాలంలో 620. మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేయించడం జరిగిందన్నారు. వైకాపా రైతు పోరుబాట పేరిట రైతులను వంచించడం సమంజసం కాదన్నారు. నాడు జగన్ వరి రైతులకు ఇవ్వాల్సిన రూ.1600 కోట్లు ఎగనామం పెట్టారని ఆయన దుయ్యబట్టారు. యూరియా కొరత అనేది వైకాపా అబూత కల్పన న్నారు. నల్లబర్లి పొగాకు రైతులను తమ ప్రభుత్వం సత్వరమే ఆదుకుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతి అని, రైతు సంక్షేమమే రాష్ట్ర సంక్షేమంగా ముందుకెళ్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు చెప్పారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నవోదయలో 11వ తరగతి చేరుటకు గడువు సెప్టెంబర్ 23 వరకు పొడిగింపు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 13)**

జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతి చేరుటకు అడ్మిషన్లకు దరఖాస్తు గడువు పొడిగించారని ప్రిన్సిపల్ సి శివరాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకాశం జిల్లా పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి అంటే పూర్తి వివరాల కోసం జవహర్ నవోదయ విద్యాలయ ఆఫీస్ నందు సంప్రదించాలని అప్లై చేసుకోవడానికి చివరి తేదీ సెప్టెంబర్ 23 వరకు గడువు పెంచారాని ప్రిన్సిపాల్ సి శివరాం తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, సెప్టెంబర్ 13)**

సుప్రీంకోర్టు నిర్ణయంతో తెలంగాణ రాష్టంలో ఎస్సీ వర్గీకరణ చేసి చట్టం చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రాహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన జరగనున్న మాదిగల కృతజ్ఞత సభకు వేలాదిగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్లు పానుగంటి షాలేం రాజ్ మాదిగ, మండాది పీటర్ మాదిగ పిలుపునిచ్చారు. యర్రగొండపాలెం పట్టణంలోని శనివారం మాదిగల కృతజ్ఞత సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల మాదిగల ఆశ, ఆకాంక్షని నెరవేరుస్తూ ఎస్సి వర్గీకరణ చట్టం చేయటం అభినందనీయమని అన్నారు. ఎస్సి వర్గీకరణ సాధించుకునేందుకు చేసిన ఎన్నో మహెూత్తర పోరాటాలలో సామాన్య మాదిగ కార్యకర్తల నుండి అత్యున్నత స్థానాల్లో ఉండి వర్గీకరణకు శ్రమించిన ఎంతో మంది ఉద్యమకారులు తమ ఇల్లు, వాకిలి, భార్య బిడ్డలను, వదిలి నిర్బంధాలు, కేసులు, జైలు శిక్షలు అనుభవించి, ఎంతో మంది ఆత్మబలిదానాలతో కూడిన వీరోచిత పోరాటాల ఫలితంగానే ఎస్సి వర్గీకరణ సాధించుకున్నామని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తు న్యాయబద్ధంగా చేసిన వర్గీకరణను ప్రశంసిస్తూ హైదరాబాద్‌లో జరిగే మాదిగల కృతజ్ఞత సభకు మాదిగ ప్రజలంతా పెద్ద ఎత్తున పాలుగోని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పల్లె వెంకటయ్య, ముటుకురి రాజు, సిద్దేల అచ్చిబాబు, పల్లెపోగు సాగర్, మాచర్ల నవీన్, సిద్దేల సుబ్బయ్య, కాకర్ల నిఖిల్, మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువులు సరఫరా పై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

**యూరియా కొనుగోలులో ఏవైనా సమస్యలు ఉన్నా....**

**అధిక ధరల అమ్మకాలుకు సంబంధించిన రైతులు ఫిర్యాదులు చేయాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, సెప్టెంబర్ 13)**

యూరియా సరఫరాపై వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఉన్న మార్క్ఫెడ్ స్టాక్ స్టోర్ చేసే అవేజ్ గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఇంతవరకు ఎంత యూరియా వచ్చింది, రైతు సేవా కేంద్రాలకు, పిఏసీఎస్, డిసిఎమ్ఎస్ లకు ఎంత యూరియా పంపించారు, గతేడాదికన్నా ఎక్కువ వచ్చిందా, తక్కువ వచ్చిందా, ఎంత నిల్వ ఉంది, యూరియా పంపిణీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా తదితర వివరాలను వ్యవసాయ అధికారుల ను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అవేజ్ గొడౌన్ నుంచి రైతు సేవా కేంద్రాలకు, పిఏసీఎస్, డిసిఎమ్ఎస్ లకు యూరియా పంపించడంపై దృష్టి సారించాలన్నారు. సీఎంఏఐడి యాప్ ద్వారా రైతులకు యూరియాను అందజేయాలని, రైతులు యూరియా కొనుగోలులో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే లేదా అధిక ధరల అమ్మకాలుకు సంబంధించి రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.ఎరువుల కోసం వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా చూడాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్‌డిఓ గ్లోరియా, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 13)**

వలేటివారిపాలెం మండలంలోని వలేటివారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీరాంనగర్ (వడ్డెపాలెం)లో శనివారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గ్రామస్తుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివార్ల కళ్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో తిలకించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ సీతారాముల దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ పాడిపంటలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటమే కాకుండా, ప్రజలలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, ఆంజనేయులు కాకుమాని హర్ష, గుత్తా మహేశ్వరరావు, వలేటి నరసింహం, శివ, సురేష్, మాధవరావు మధు సుబ్బారావు, కందుల వెంకటేశ్వర్లు, బండారు కొండయ్య, చల్లా లక్ష్మయ్య, కందుల రవీంద్ర, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ఇర్ల మాల్యాద్రి ప్రసాదు రాంబాబు వెంకటరావు, ఇతర ముఖ్య నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## చక్కా కేశవకు, రవ్వా శ్రీనుకు శ్రీసాయి ప్రజాసేవారత్న జాతీయ పురస్కారం





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 13)**

కందుకూరు పట్టణానికి చెందిన ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవా హృదయ డాక్టర్ రవ్వా శ్రీనివాసులుకు శనివారం చిలకలూరిపేటలోని మెడికల్ హాల్ లో జయ జయ సాయి ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ ఆధ్వర్యంలో ముఖ్య అతిథుల సమక్షంలో వారి చేతుల మీదుగా శ్రీసాయి ప్రజాసేవారత్న జాతీయ ఉత్తమ సేవా పురస్కారాలు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు కేశవ,శ్రీను మాట్లాడుతూ శ్రీ సాయి ప్రజాసేవారత్న అవార్డుకు మేము చేస్తున్న వివిధ రకాల భక్తి,సేవా కార్యక్రమాలను గుర్తించి మమ్మల్ని ఎంపిక చేసిన పూసపాటి బాలాజీ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ అవార్డు రావడానికి ముఖ్య కారణం నిరంతరం నిరుపేదలకు,మతిస్థిమితం లేనివారికి, నిరాశ్రయులకు ఆహారం పంపిణీ, నిత్యావసర సరుకుల పంపిణీ, వివిధ రకాల సేవలను గుర్తించి వచ్చింది అని తెలిపారు. ఈ సందర్భంగా వారి మిత్రులు బంధువులు కేశవకు, శ్రీనుకు శుభాకాంక్షలు తెలిపారు.

# సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే కందులను కలిసిన విద్యార్థులు

### పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని యాజమాన్యాలకు సూచించిన ఎమ్మెల్యే

### ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం పట్టణం, సెప్టెంబర్13)**

మార్కాపురం పట్టణంలోని ఎమ్మెల్యే వారి క్యాంప్ కార్యాలయంలో శనివారం వివిధ కాలేజీల డిగ్రీ విద్యార్థులు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక సంవత్సరానికి ఫీజు చెల్లిస్తేనే ఎగ్జామ్ ఫీజు కట్టించుకుంటామని అంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే కళాశాల యాజమాన్యాలను పిలిపించి మొదట విద్యార్థుల ఎగ్జామ్ ఫీజు కట్టించుకోవాలని త్వరలోనే విద్యార్థుల ఫీజు రీఎంబర్స్మెంట్ ఖాతాల్లో జమ అవుతాయని యాజమాన్యాలకు నచ్చజెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ త్వరలోనే తమ యువ నాయకుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుని కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం క్యాంప్ ఆఫీస్‌కి వచ్చిన ఒక దివ్యాంగురాలిని పరామర్శించి సంపూర్ణ దివ్యాంగురాలు పెన్షన్ అప్లై చేయాలని చెప్పి సంబంధిత అధికారులతో మాట్లాడారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మి, దూదేకుల శాంతమ్మకు రూ.1,27,000 సీఎం సహాయ నిధి చెక్కు అందజేశారు.









# భారతదేశ ప్రజల విముక్తి తత్వవేత్త అంబేద్కర్



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టెంబర్ 13)**

భారతదేశ విముక్తి తత్వవేత్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాస్టర్ ఇంగిలాల రామచంద్రరావు అన్నారు. శనివారం కనిగిరి లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ నందు అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర నాయకులు చదలవాడ బాల గురవయ్య అధ్యక్షతన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంత అధ్యయన తరగతులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అంబేద్కర్ చాలామంది దృష్టిలో అన్నగారిన వర్గాల ప్రజలకు రిజర్వేషన్ల స్థాపకుడుగాను ప్రచారం జరుగుతుందని అంత మాత్రమే గాక, ఆయన భారత దేశ విముక్తి తత్తవేత్త భారతదేశ దోపిడి తత్వశాస్త్రముగా బ్రాహ్మణ వాదం దానికి విరుగుడుగా భారతదేశానికి విముక్తి తత్వశాస్త్రాన్ని అందించాడు అందువల్ల ఈయన భారత దేశ విముక్తి తత్వవేత్త అవుతాడు ,అంబేద్కర్ ఆధునిక భారతదేశ బుద్ధుడు 1986 అక్టోబర్ 14వ తేదీన ఐదు లక్షల తన అనుచరులతో మహారాష్ట్రలోని నాగపూర్ నగరంలో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాడు ఆ తరువాత ప్రపంచ మత చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు ఆధునిక భారతదేశ బుద్ధుడిగా పేరుగాంచిన వాడైన బుద్ధ అండ్ ధర్మ పేరుతో బౌద్ధ ధర్మ విశిష్టత దాని ఆవశ్యకతను వివరించారు ఈ 20వ శతాబ్దానికి సకల దేశాలలోని పీడిత ప్రజల విముక్తి సిద్ధాంతాన్ని అందించాడు తద్వారా పీడిత ప్రజల విముక్తి తత్వవేత్తగా పేరుగాంచారు ఈ విషయాన్ని ప్రచారం చేసేందుకు అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తూ ముందుకు పోతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, పూలే సేవా సమితి నాయకులు దేవపురి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాప బత్తిని నారయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎనుబరి రవీంద్రబాబు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసిన్, ప్రముఖ న్యాయవాది యరజాల బాల నారాయణ, బిటిఏ నాయకులు చీమలదిన చిన్న వెంకయ్య, ఏడిపిఎస్ నాయకులు చిట్టేటి రమణయ్య, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు జొన్నలగడ్డ గోవిందయ్య, విశ్రాంతి ఉపాధ్యాయులు టి ఏ ప్రతాప్, సామాజిక ఉద్యమకారులు కలవకురి శాంత రాజు, కొటికల బాల బాదర్ల, బి టి ఏ జిల్లా అధ్యక్షులు దద్దాల శ్రీనివాసులు, అంబేద్కర్ వారసులు బుద్ధిస్టులు తదితరులు పాల్గొన్నారు.



# ఖరీఫ్ పంటలో యాజమాన్య పద్ధతుల పై శిక్షణ




(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టెంబర్ 13)
మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో ఆత్మ - వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి పి జోష్ణ దేవి రైతులకు ఖరీఫ్ పంటలలో యాజమాన్య పద్ధతులు పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రధాన పొలంలో పంటలు సాగు చేయనప్పుడు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని తెలియజేశారు. మెట్ట పంటలు కంది, పెసర, మినుము, సెనగ విత్తనాలకు రైతులు తప్పనిసరిగా ఇమిడా క్లోప్రిడ్ 5 %ఎశ్రీ% కేజీ విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని చూపించారు. ట్రైకోడెర్మా తో కలిపి విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే వేరు కుళు ౢ, ఎండుతెగులు నివారించుకోవచ్చని సూచించారు. రైజోబియంతో విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే గాలిలోని నత్రజని వేరుబుడిపెలుద్వారా మొక్కకు అందిస్తాయని తెలియజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఏడిఏ మార్కాపురం బాలాజీ నాయక్ మాట్లాడుతూ రబి 2025 సంవత్సరానికి నల్లబర్లీ పొగాకుసాగును ప్రభుత్వం వారు నిషేధించారు కావున రైతులు ఎవరూ కూడా నల్లబర్లీ పొగాకు సాగు చేయకూడదని సూచించారు. తెల్లబర్లి పొగాకు సాగుకూడా కంపెనీ వారితో ముందస్తు ఒప్పందం చేసుకొని మాత్రమే సాగుచేయాలని, ముందస్తు ఒప్పందం లేని పక్షమున ప్రభుత్వం వారు గాని వ్యవసాయ శాఖ వారు గాని బాధ్యులు కారని తెలిపారు. విత్తనం కోసం సాగు చేసే మొక్కజొన్న పంటకు రైతులు విధిగా కంపెనీ వారి వద్ద అగ్రిమెంటు తీసుకోవాలని తెలియజేశారు. తర్లుపాడు మండలంలో యూరియా కొరత లేదని రైతులు ఎటువంటి ఆందోళన చందనవసరం లేదని రైతులకు తెలియజేశారు. యూరియాకు బదులుగా నానో యూరియాను రైతులు అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవేంద్ర గౌడ్, గ్రామ వ్యవసాయ సహాయకులు మల్లికార్జున్, తుమ్మలచెరువు గ్రామ రైతులు పాల్గొన్నారు.






# ఆపదలో ప్రజలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

## ఎమ్మెల్యే ఇంటూరి

## 53 మంది లబ్ధిదారులకు రూ.31 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 13)
అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులను భరించలేని పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఉదయం కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వయంగా 53 మంది లబ్ధిదారులకు 31 లక్షల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు చికిత్స చేయించుకునే పేదలకు సహాయం చేయాలనే దృఢ సంకల్పంతో సీఎంనారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయాన్ని అందజేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి సహాయం పేదలకు అందలేదని విమర్శించారు. గుడ్లూరు మండలంలో 6 మంది లబ్ధిదారులకు రూ.4.22 లక్షలు, ఉలవపాడు మండలంలో 5 మంది లబ్ధిదారులకు రూ.4.50 లక్షలు, లింగసముద్రం మండలంలో 13 మంది లబ్ధిదారులకు రూ.5.04 లక్షలు, కందుకూరు మండలంలో 5 మంది లబ్ధిదారులకు రూ.4.17 లక్షలు, కందుకూరు పట్టణంలో 6 మంది లబ్ధిదారులకు రూ.5.70 లక్షలు, వలేటివారిపాలెం మండలంలో 12 మంది లబ్ధిదారులకు రూ.7.60 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తమ వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు, పూరిమెట్ల గురునాథం, కంద్రా మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, తల్లపనేని రవీంద్ర, తదితర నాయకులు పాల్గొన్నారు.



# రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టెంబర్ 13)
ఉపాధ్యాయ సమస్యలపై ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు యూటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గిద్దలూరు మండల అధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య తెలిపారు. తదనంతరం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆర్థిక, విద్యా రంగ సమస్యల సాధనకు ఈనెల 15 నుంచి 19 వరకు బైక్ జాత కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించని ఎడల యూటీఫ్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 న విజయవాడలో రణభేరి కార్యక్రమం నిర్వహించడము జరుగుతుందన్నారు. గిద్దలూరు యూటిఎఫ్ ఆఫీసులో శనివారం జరిగిన రణభేరి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కార్యదర్శి యం.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సమస్యలపై పోరాటం నిర్వహించబోతున్నామన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటిన ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రధాన కార్యదర్శి ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిఏలు, అరియర్స్, పియార్సీ వంటివి ఇవ్వకపోవడం ఉపాధ్యాయులను కలతకు గురి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి ఈ వెంకటేశ్వర్లు, ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి యం సత్యనారాయణరెడ్డి, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, యూటిఎఫ్ నాయకులు జయచంద్రరెడ్డి, మండల శాఖ బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

# విషం తాగి ఆత్మహత్య

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, సెప్టెంబర్ 13)
మండలంలోని పోతలపాడు గ్రామంలో శనివారం అప్పుల బాధతో విషం తాగి రాచకొండ కాశయ్య అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తర్లుపాడు ఎస్ఐ బి బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# 100 మందికి మించకుండా సమావేశం నిర్వహించుకోవాలి

### డిఎస్పీ బాల సుబ్రహ్మణ్యం




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 13)**

నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం కరేడు గ్రామస్తులతో ఆదివారం జరగబోవు బోడే రామచంద్ర యాదవ్ సమావేశానికి వందమందికి మించకుండా సమావేశం నిర్వహించుకోవాలని హైకోర్టు పిటిషన్ నెంబర్ 21157/2025 ద్వారా పోలీసు శాఖకు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినది. ఈ సమావేశం కరేడు గ్రామ ప్రజలతో వందమందికి మించకుండా ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు నిర్వహించుకోవాలని బయట గ్రామస్తులు ఎవరికి సమావేశానికి అనుమతులు లేవని డిఎస్పీ బాలసుబ్రమణ్యం తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను అతిక్రమించి బయట గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటే చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకొబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సీఐ షేక్ అన్వర్ భాష, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని న్యాయస్థానాలలో జాతీయ లోక్ అదాలత్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 13)**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సుమారు 167 సివిల్ వ్యాజ్యాలు దాదాపుగా 6558 క్రిమినల్ వ్యాజ్యాలు, ప్రీ లిటిగేషన్ స్థాయిలో 4 కేసులు పరిష్కరించడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా కక్షదారులకు మోటార్ వాహన ప్రమాద భీమా కేసుల్లోనూ, కొన్ని రకాలైన ఇతర కేసుల్లో దాదాపుగా రెండు కోట్ల రూపాయలు పరిష్కారం రూపంలో చెల్లింపులు చేయడం జరిగిందని తెలిపారు. కేసుల పరిష్కారం కోసం ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 25 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ బెంచీలలో న్యాయమూర్తులు ,న్యాయవాదులు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం సహకరించిన న్యాయవాదులకు పోలీస్ వారికి వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులకు, బ్యాంకు అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు న్యాయ సేవాధికార సంస్థ తరపున అభినందనలు తెలియజేశారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు పాటుపడుతున్నారు

### జగన్ మట్టి ముంత ఇచ్చి రాగి చెంబు లాక్కునే రకం
### మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి






**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, సెప్టంబర్ 13)**

రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాటుపడుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంప్ కార్యాలయంలో 13 మంది లబ్ధిదారులకు రూ.22 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం చంద్రబాబు పాటుపడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం. తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం, అన్నదాత సుఖీభవ, మెగా డీఎస్సీ ఇలా హామీలన్నీ ఏడాదిలోనే అమలు చేశాం. ఎన్నికల్లో చెప్పారు కాబట్టి, ఎన్ని కష్టాలున్నా అన్ని హామీలు అమలు చేస్తాం. ఆటో డ్రైవర్లకి దసరా పండుగ నాడు రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. జగన్ మట్టి ముంత ఇచ్చి రాగి చెంబు లాక్కునే రకమన్నారు. నాడు జగన్ ఆటో డ్రైవర్లకి ఏడాదికి రూ.10 వేలిచ్చి జరిమానాలు పేరుతో రూ.30 వేలు లాక్కున్నారని గుర్తు చేశారు. సంక్షేమం పేరుతో జగన్ దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఏం చేసినా ప్రజల శ్రేయస్సుకే, జగన్ ఏం చేసినా అందులో మోసం, దోపిడీ ఉంటుందని మంత్రి స్వామి అన్నారు.

---

# ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

### నిర్ధేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు కృషి చేయాలి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 13)**



ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం ప్రకాశం జిల్లా కలెక్టర్ గా భాద్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు జిల్లా అధికారులతో సమావేశమై వివిధ శాఖల అధికారులను పరిచయం చేసుకుంటూ, ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలుచేస్తున్న ప్రాధాన్యత కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు సంబంధిత శాఖల జిల్లా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు జవాబుదారీతనంతో, నిజాయితీతో, బాధ్యతతో విధులను నిర్వర్తించాలని, అధికారులను



ఆదేశించారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వివిధ సమస్యల పై వచ్చే ఆర్జీలను సంబంధిత శాఖల అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకుని జవాబుదారీతనంతో అర్జీదారులకు సంతృప్తికరమైన పరష్కారం చూపాల్సిన బాధ్యత అధికారుల పై ఉందన్నారు. ఆ దిశగా అధికారులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిష్కారం కాని సమస్య అంటూ ఉండదని, ఆ సమస్య పై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా పరిశీలన చేసి వాటి పరిష్కార మార్గాలు, సమస్య మూలలు తెలుసుకుని పరిష్కార దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఆయా శాఖలకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు అధికారులు సమగ్రంగా వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్వో బి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 13)**

**ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయం నందు 33 మంది** లబ్ధిదారులకు 27 లక్షల 38 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, ముత్తన శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com